# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బూత్ కన్వీనర్లు సమన్వయంతో ముందుకు సాగాలి
- పశ్చిమలో బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్
- హనుమకొండ స్నేహనగర్‌లో బూత్ కన్వీనర్లతో సమావేశం



సమావేశానికి హాజరైన నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్లు

హనుమకొండ, అక్టోబర్ 12 : 'ఎన్నికలు అనగానే ఆగం కావద్దు.. ప్రతి బూత్ కన్వీనర్ తానే అభ్యర్థి అనుకొని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలోని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలి' అని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ స్నేహానగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజక వర్గం బూత్ కన్వీనర్ల సమావేశంలో చీఫ్ విప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ కన్వీనర్లకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టేందుకు వరంగల్ పశ్చిమ నియోకవర్గం ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దులుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లిందన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని ప్రతి గడపకూ తీసుకెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించాలని చీఫ్ విప్ సూచించారు. ఇప్పటి వరకు చేసిన ప్రగతిని ప్రజలకు నేరుగా వివరించే అద్భుతమైన అవకాశం మనకు దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పాలనలో సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రతి ఒక్కరితో మమేకమై ఓట్లు అడగాలన్నారు. ప్రతి బూత్ కన్వీనర్ పార్టీ విజయానికి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రేపటి నుంచి ఎన్నికలయ్యేంత వరకు బూత్ స్థాయిలో సంపూర్ణ బాధ్యత మీరే తీసుకోవాలన్నారు. సంక్రాంతికి గంగిరెద్దు వచ్చినట్లు.. ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపోళ్లు వస్తారని, వాళ్లను నిలదీయాలని సూచించారు. ఇప్పుడు ఒక్క చాన్స్ అని కాంగ్రెస్ అడుగుతోందని, ఇప్పటికే కాంగ్రెస్‌కు 11 అవకాశాలు ఇచ్చామని, అప్పుడు చేయలేని పనులు ఇప్పుడు చేస్తారా? అని ప్రశ్నించారు. నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఆలోచించి పనిచేసే కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరాలని చీఫ్ విప్ సూచించారు. సమావేశంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జన్ను జకార్య, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో శేషుబారతి, అర్చకుడు శేషు

## భద్రకాళీ శరన్నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- రేపటి నుంచి వేడుకలు ప్రారంభం
- 23న విజయ దశమి, తెప్పోత్సవం
- 24న భద్రకాళీ-భద్రేశ్వరుల కల్యాణోత్సవం

వరంగల్,అక్టోబర్ 13 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో భద్రకాళీ శరన్నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు శేషు విలేకరులతో మాట్లాడుతూ ఏర్పాట్ల గురించి వివరించారు. ఆదివారం నుంచి 24వ తేదీ వరకు భద్రకాళీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా నిర్వహిస్తామని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు. 23న విజయ దశమి (దసరా) రోజు విశేష పూజలు ఉంటాయని తెలిపారు. అదే రోజు సాయంత్రం తెప్పోత్సవం కనులపండువగా జరుగుతుందని వివరించారు. 24న భద్రకాళీ-భద్రీశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు దేవాలయంలో జరిగే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఉత్సవాల్లో భాగంగా రోజు సాయంత్రం ఆలయంలో సాంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్ కుమార్, సినియర్ అసిస్టెంట్ హరినాథ్, అర్చకులు సత్యం పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలి : మంత్రి ఎర్రబెల్లి



లయన్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ వేడుకలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, అక్టోబర్ 13: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని సమాజంలో తమ వంతు సహకారం తోటి వారికి అందించాలని రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ సేవా తరుణి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన లయన్స్ క్లబ్ ఆఫ్ పర్వతగిరి ప్రజెంటేషన్ అండ్ ఇన్‌స్టాలేషన్ వేడుకలో ముఖ్యఅతిథిగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ ద్వారా ప్రతి ఒక్కరూ సేవ చేయాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ కంటే నూతనంగా ఏర్పాటు చేసిన పర్వతగిరి లయన్స్ క్లబ్ సేవ రంగంలో ముందంజలో ఉండాలని సూచించారు. మానవ సేవ ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. ఆపదలో ఉన్న సాటి వారికి తమ వంతు తోడ్పాటును అందించాలని కోరారు. అనంతరం పర్వతగిరి లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు చిదురాల వేణుగోపాల్‌కు మంత్రి ఎర్రబెల్లి శాలువా కప్పి సన్మానించారు. నూతన కార్యవర్గం భవిష్యత్‌లో సేవా భావంతో రాణించాలని సూచించారు. పర్వతగిరిలో లయన్స్ క్లబ్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని మంత్రి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ రమేశ్

## డిసెంబర్ 28 నుంచి కేయూలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ : వీసీ రమేశ్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 13: కాకతీయ విశ్వవిద్యాలయ వేదికగా డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో జరిగే ప్రతిష్టాత్మక ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్‌ను విజయవంతం చేయాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ కోరారు. విశ్వవిద్యాలయ అతిథిగృహంలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ విశ్వవిద్యాలయ మానిటరింగ్ కమిటీతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమన్వయంతో కలిసి ఒక టీంగా పనిచేయాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింత ముందుకు తీసుకుపోవాలన్నారు. ప్రారంభం నుంచి ముగింపు సమావేశం ప్రకారం ఒక ప్రణాళికాబద్ధమైన ఆలోచనతో ముందుకు పోవాలన్నారు. తదనుగుణంగా బడ్జెట్ రూపకల్పన, నిధుల సమీకరణ, అతిథులకు వసతి ఏర్పాట్లు, ఆహ్వానితుల సౌకర్యాల కల్పన, జాతీయ, అంతర్జాతీ సంస్థల నుంచి విశ్వవిద్యాలయానికి వచ్చే చరిత్రకారుల ప్రతినిధుల రవాణా, వసతి, భోజన ఏర్పాట్లు, లోకల్ పర్యాటక ప్రాంతాల సందర్శనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే, వారి అనుభవాలు, వారి పరిశోధనలు విశ్వవిద్యాలయ బోధనా సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులకు ఉపయోగపడేలా సమావేశాలు, సెషన్‌లు, గోష్టిలు ఏర్పాటు చేయాలన్నారు. ఐదు, ఆరు తరాల చరిత్రకారులు హాజరువుతున్న దృష్ట్యా ఇందుకు అవసరమైన కమిటీల ఏర్పాట్లు, ముందస్తు సమావేశాలు, అందులో తీసుకున్న నిర్ణయాల అమలుపై కూడా దృష్టిపెట్టాలన్నారు. ఈ సమావేశానికి సుమారు 2000 మంది హాజరవుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన ఉండాలని, మరిన్ని యూనివర్సిటీస్థాయి ముఖ్య కమిటీలు, విభాగస్థాయి అంతర్గత కమిటీల ఏర్పాటు చేసుకోవాలన్నారు. 30 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఈ సమావేశాన్ని అందరూ గుర్తుంచుకునేలా రూపకల్పన చేయాలన్నారు. గత చరిత్ర అనుభవంగా, రాబోయే తరాలకి మార్గదర్శకంగా, ప్రపంచానికి దిక్సూచిగా తీసుకోబోయే విధాన నిర్ణయాలను పుస్తకరూపంలో బయటకు తీసుకురావాలన్నారు. చరిత్ర విభాగంలోని విశ్రాంత ఆచార్యులు, నిష్ణాతుల సేవలు, సూచనలను కూడా తీసుకోవాలన్నారు. దేశంలోనే ముఖ్యమైన ప్రొఫెషనల్ బాడీ అయిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌కు కేయూ ఆతిథ్యం ఇవ్వడం సువర్ణ అవకాశంగా మలుచుకోవాలన్నారు. న్యాక్‌లో పనిచేసిన అనుభవం, స్నాతకోత్సవ నిర్వహణ, ఈ మధ్య నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుల అనుభవాలు, లోటుపాట్లు గమనించి ముందుకుపోవాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పనిని ఒకటికి రెండుసార్లు రిహార్సల్ చేసుకోవాలన్నారు. తప్పులు దొర్లకుండా పనిచేయాలన్నారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ లోకల్ సెక్రటరీ ప్రొఫెసర్ టీ మనోహర్ ఒక సంక్షిప్త రిపోర్ట్‌ను మానిటరింగ్ కమిటీలో వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్లు ఎస్ శ్రీనాథ్, ఎన్ రామస్వామి, ఆర్ మల్లికార్జున రెడ్డి, బన్న అయిలయ్య, ఎస్ నరసింహాచారి, పీ శ్రీనివాసరావు, ఫైనాన్స్ ఆఫీసర్ టీ రాజయ్య, సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ కోలా శంకర్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గెలుపు నల్లేరుపై నడకే..

- హ్యాట్రిక్ విజయమే మన లక్ష్యం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేశ్
- వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలులో ముఖ్య నాయకులతో సమావేశం



ఐనవోలు: మండల కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

వర్ధన్నపేట, అక్టోబర్ 13 : ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ గెలుపు నల్లేరుపై నడకే అని పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి అధ్యక్షతన శుక్రవారం జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమే బీఆర్ఎస్ పార్టీ విశేషంగా కృషి చేసినట్లు తెలిపారు. ప్రజలంతా మరోసారి సీఎం కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని బలంగా కోరుకుంటున్నారన్నారు. అంతేకాక వర్ధన్నపేట నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించినట్లు తెలిపారు. పదేళ్ల క్రితం వర్ధన్నపేట నియోజకవర్గ పరిస్థితి ఎలా ఉందనే విషయాన్ని తెలుపుతూ ప్రస్తుతం జరిగిన అభివృద్ధిని కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధితో పార్టీకి వచ్చే ఎన్నికల్లో లక్ష మెజార్టీ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో గ్రామాల్లో విస్తృత ప్రచారాలు నిర్వహించాలని కోరారు. అలాగే, ప్రజలను మభ్య పెట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు విపక్ష పార్టీల నాయకులు చేస్తున్న విమర్శలను గ్రామ స్థాయి కార్యకర్తలు తిప్పి కొట్టాలన్నారు. అలాగే ఎన్నికల్లో కార్యకర్తలు అనుసరించాల్సిన విధానాలు, ప్రచారశైలి, తదితర విషయాలపై ఎమ్మెల్యే పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమగ్రంగా చర్చించారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఏఎంసీ చైర్మన్ స్వామిరాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పర్వతగిరి మండల ముఖ్య నాయకులతో..**

పర్వతగిరి : మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమన్వయ కమిటీ సభ్యులు, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ ఇన్‌చార్జిలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే అరూరి సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచార శైలి అనుసరించాల్సిన పద్ధతులపై నాయకులతో చర్చించారు. ఎంపీపీ కమల, జడ్పీటీసీ సింగ్‌లాల్, పీఏసీఎస్ చైర్మన్లు మనోజ్‌కుమార్, గొర్రె దేవేందర్, మార్కెట్ డైరెక్టర్లు పట్టపురం ఏకాంతంగౌడ్, సర్పంచ్‌లు మాలతీ సోమేశ్వర్‌రావు, పిడుగు రేణుకా సాయిలు, తౌటి దేవేందర్, ఎంపీటీసీలు మాడుగుల రాజు, కర్నెళ్ల మోహన్‌రావు, మండల అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్ పాల్గొన్నారు..

**ఐనవోలు మండలంలో..**

ఐనవోలు : మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొలెపల్లి శంకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే అరూరి రమేశ్ హాజరయ్యారు. అభివృద్ధి వైపే వర్ధన్నపేట నియోవజవర్గ ప్రజలు ఉంటారని, మరోసారి లక్ష మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. సమావేశంలో ఎంపీపీ మార్నేని మధుమతి, జడ్పీ కోఆప్షన్ మెంబర్ ఉస్మాన్‌అలీ, వైస్ ఎంపీపీ మోహన్, మండల రైతు బంధు సమితి కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జయపాల్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.